మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

బాపట్ల | గుంటూరు | పల్నాడు

శుక్రవారం 21 ఆగస్టు 2026 పేజీలు : 4


## 22ఏ, టిడ్కోపై ప్రత్తిపాటి గళం

- ఐదు లక్షల మందికి 22ఏ సమస్య..
- ఇళ్లు రాని వారికి డబ్బులైనా ఇవ్వాలని డిమాండ్
- అసెంబ్లీ జీరో అవర్‌లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే

22ఏ 1సీ భూముల సమస్యతో రాష్ట్రంలో ఐదు లక్షల మంది ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. టిడ్కో ఇళ్లు రాని లబ్ధిదారులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

అమరావతి:రక్షణ న్యూస్:



2లో




# "సారీ సతీష్..!"

- విగ్రహాల విషయంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మకు వరుసగా ఎదురుదెబ్బలేనా?

2లో.

- ఎమ్మెల్యే నరేంద్ర నిర్ణయాలపై రాజకీయ చర్చ...



మాజీ ఎమ్మెల్సీ సతీష్ అంటే భయమా.. భక్తా? చివరికి 'సారీ సతీష్' అనాల్సిందేనా? బాపట్ల రాజకీయాల్లో ఇప్పుడు ఇదే హాట్‌టాపిక్. ఎమ్మెల్యే నరేంద్ర వర్మ నిర్ణయం తీసుకోవడం.. సతీష్ ప్రశ్నించడం.. వెంటనే మార్పులు జరగడం వరుసగా కనిపిస్తుండటంతో అసలు రాజకీయం ఏంటన్న చర్చ మొదలైంది. ఎమ్మెల్యే నిర్ణయాలకు సతీష్ అభ్యంతరాలే బ్రేకులు వేస్తున్నాయా? లేక తెరవెనుక మరో రాజకీయ అవగాహన నడుస్తోందా? అన్న ప్రశ్నలు బాపట్లలో రాజకీయ వేడి పెంచుతున్నాయి.

బాపట్ల జిల్లా రక్షణ పొలిటికల్ స్పెషల్...


## వినికిడి లోపం ఉన్నవారికి డిగ్రీ కళాశాల

### వెదుల్లపల్లిలో తొలి ప్రభుత్వ కళాశాల.. 30 సీట్లతో బీకాం

### 23 నుంచి దరఖాస్తులు.. ఏఐ సర్టిఫికేషన్ కోర్సు కూడా

వినికిడి లోపం ఉన్న విద్యార్థుల ఉన్నత విద్యకు రాష్ట్రంలో తొలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటైంది. బాపట్ల జిల్లా వెదుల్లపల్లిలో 30 సీట్లతో బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సును ప్రారంభించనున్నారు.

గుంటూరు:రక్షణ న్యూస్:




## బాలకోటిరెడ్డి పై వేటు

వివరాలు 2లో..

వివాదాల పరంపర.. టీడీపీ నుంచి సస్పెన్షన్

జనసేన నేతలతో గొడవ నుంచి పాత వివాదాల వరకు.. అధిష్ఠానం చర్య

అమరావతి:రక్షణ న్యూస్:




వేమూరు

టీడీపీ నేత గుదేటి బాలకోటిరెడ్డిపై పార్టీ అధిష్ఠానం సస్పెన్షన్ వేటు వేసింది. క్రమశిక్షణ ఉల్లంఘన, జనసేన నేతలతో వివాదం, గతంలో వైసీపీ కార్యకర్తలపై దాడులు, ఎస్పీని లక్ష్యంగా చేసుకున్న వీడియోల వివాదాలను పరిగణనలోకి తీసుకుని చర్యలు చేపట్టింది.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/21/2026 4:53 AM Page 2



## 22ఏ, టిడ్కోపై ప్రత్తిపాటి గళం

మొదటి పేజీ తరువాయి

**అమరావతి:రక్షణ న్యూస్:**

22ఏ 1సీ భూముల సమస్య, టిడ్కో ఇళ్ల కేటాయింపులో నెల కొన్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. గురువారం శాసన సభలో జీరో అవర్‌లో ఈ రెండు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. లక్షలాది కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం ప్రజా ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.

**5 లక్షల మందికి ఇబ్బందులు../...**22ఏ 1సీ సమస్యతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు ఐదు లక్షల మంది ఇబ్బందులు పడుతున్నారని ప్రత్తిపాటి తెలిపారు. చిలకలూరిపేట పట్టణంలోనే సుమారు 20 వేల మంది ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని చెప్పారు. రెవెన్యూ సమస్యల్లో చాలా వరకు పరిష్కారం లభిం చినా.. భూమి తక్కువగా, బాధితులు ఎక్కువగా ఉన్న 22ఏ 1సీ అంశం మాత్రం ఇంకా అపరిష్కృతంగానే ఉందన్నారు. ఈ సమస్యతో ఆర్థిక లావాదేవీలు, ఆస్తుల క్రయవిక్రయాలు తదితర అనేక అంశాలు ముడిపడి ఉన్నాయని తెలిపారు. ప్రజలు పడుతున్న ఇబ్బం దులను దృష్టిలో పెట్టుకుని దేవాదాయ, రెవెన్యూ శాఖలు సమన్వ యంతో పనిచేసి పరిష్కారం చూపాలని కోరారు. 2013లో సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిందని గుర్తుచేశా రు. మిగిలినవివాదాలను త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

**ఇళ్లు ఇవ్వాలి.. లేదంటే సొమ్ము..**టిడ్కో ఇళ్ల రెండో దశ కేటాయింపులు ఇంకా పూర్తికాలేదని ప్రత్తిపాటి అన్నారు. డబ్బులు చెల్లించిన లబ్ధిదారులు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. టిడ్కో గృహ సముదాయాల్లో పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, దుకాణ సముదాయాలు, శ్మశానవాటికలు వంటి మౌలిక వసతులు పూర్తి చేయాలని కోరారు.రూ.లక్ష, రూ.50 వేల చొప్పున చెల్లించినప్పటికీ ఇళ్లు మంజూరు కాని లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని.. సాధ్యం కాకపోతే వారు చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని సూచించారు. చిలకలూరిపేటలో ఇళ్లు మంజూరు కాని లబ్ధిదారులకు సుమారు రూ.కోటి వరకు చెల్లించాల్సి ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఈ సమస్యను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణించి త్వరగా పరిష్కరించాలని ప్రత్తిపాటి పుల్లారావు కోరారు.

## "సారీ సతీష్..!"

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల జిల్లా రక్షణ పొలిటికల్ స్పెషల్...**

బాపట్లలో విగ్రహాల వ్యవహారం ఇప్పుడు రాజకీయంగా వేడెక్కుతోంది. ఎమ్మెల్యే వేగేసిన నరేంద్ర వర్మ నిర్ణయం తీసుకోవడం.. మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ప్రశ్నించడం.. ఆ వెంటనే మార్పులు జరగడం వరుసగా కనిపిస్తుండటంతో రాజకీయ చర్చ మొదలైంది. ముందే ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిన ఎమ్మెల్యే.. అభ్యంతరం వచ్చిన తర్వాతే ఎందుకు వెనక్కి తగ్గాల్సి వస్తోందన్న ప్రశ్న ఇప్పుడు బాపట్ల ప్రజల్లో వినిపిస్తోంది.బాపట్లలో విగ్రహాల వ్యవహారం చూస్తుంటే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ముందు నిర్ణయం.. తర్వాత అభ్యంతరం.. ఆపై సవరణ. ఇదే ఇప్పుడు ఎమ్మెల్యే నరేంద్ర వర్మకు రాజకీయంగా ఇబ్బందికరంగా మారుతోంది. ముఖ్యంగా ఎన్టీఆర్ విగ్రహం శిలాఫలకం విషయంలో జరిగిన పరిణామాలు ఈ చర్చకు మరింత బలం చేకూర్చాయి.గడియార స్తంభం వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినప్పుడు శిలాఫలకంపై ప్రస్తుతం ఉన్న నాయకుల పేర్లు మాత్రమే ఉండటం వివాదానికి దారితీసింది. గతంలో ఆ విగ్రహాన్ని తానే తీసుకొచ్చి, తయారు చేయించి, సొంత నిధులతో ఏర్పాటు చేశానని అన్నం సతీష్ ప్రభాకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు లేఖలు రాశారు. ఆ తర్వాత రెండు రోజుల్లోనే పాత పేర్లను శిలాఫలకంపై చేర్చడం చర్చనీయాంశంగా మారింది.ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. పాత పేర్లు ముందే ఎందుకు పెట్టలేదు? విగ్రహం ఎవరి కృషితో ఏర్పడింది, గతంలో ఎవరి పాత్ర ఉంది అనే విషయం అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియదా? అభ్యంతరం వచ్చి, లేఖలు వెళ్లి, విషయం ఉన్నతస్థాయికి చేరిన తర్వాతే పాత పేర్లు గుర్తుకు రావడం ఏమిటన్న ప్రశ్నలు వస్తున్నాయి.ఇది ఒక్క విగ్రహం విషయంలో జరిగిన పొరపాటుగా చూస్తే పెద్ద విషయం కాకపోవచ్చు. కానీ ఇలాంటి పరిణామాలు వరుసగా జరుగుతున్నాయన్న ప్రచారం ఎమ్మెల్యే వర్గానికే ఇబ్బందికరంగా మారుతోంది. ఒకసారి నిర్ణయం తీసుకుని, ఎవరో ప్రశ్నించిన తర్వాత దాన్ని మార్చుకోవాల్సి వస్తే.. ఎమ్మెల్యే నిర్ణయాలపై సహజంగానే అనుమానాలు వస్తాయి.అందుకే బాపట్లలో ఇప్పుడు ఒక మాట వినిపిస్తోంది. "ఎమ్మెల్యే నిర్ణయం తీసుకుంటారా.. లేక సతీష్ ప్రశ్నించిన తర్వాత నిర్ణయం సరిచేసుకుంటారా?" అని.నరేంద్ర వర్మ, సతీష్ ప్రభాకర్ మధ్య సంబంధం కూడా ఈ మొత్తం వ్యవహారానికి మరో రాజకీయ రంగు తీసుకొస్తోంది. ఒకప్పుడు మంచి స్నేహితులుగా ఉన్న ఇద్దరి మధ్య తర్వాత విభేదాలు వచ్చాయి. రాజకీయంగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే 2024 ఎన్నికల సమయంలో మళ్లీ ఇద్దరూ దగ్గర కావడంతో పాత విభేదాలు ముగిశాయని చాలామంది భావించారు.కానీ ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు మాత్రం ఆ స్నేహం ఎంతవరకు ఉందో, రాజకీయంగా ఇద్దరి మధ్య అసలు అవగాహన ఏమిటో మరోసారి ప్రశ్నిస్తున్నాయి. సతీష్ ఒక అంశాన్ని బహిరంగంగా ప్రశ్నిస్తే.. నరేంద్ర వర్మ వైపు నుంచి వెంటనే స్పందన రావడం, మార్పులు చోటుచేసుకోవడం చూస్తుంటే ఇద్దరి మధ్య తెరవెనుక ఏదైనా రాజకీయ అవగాహన ఉందా? లేక ఆధిపత్య పోరాటమే నడుస్తుందా? అన్న చర్చ మొదలైంది.మరోవైపు ఎమ్మెల్యే అభిమానుల్లో కూడా అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. మొదట్లోనే అన్ని విషయాలు చూసుకుని నిర్ణయం తీసుకుంటే ఈ పరిస్థితి ఎందుకు వస్తుంది? ఎవరో ప్రశ్నించే వరకు ఎందుకు ఆగాలి? అని వారు ప్రశ్నిస్తున్నారు.ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న వ్యక్తి ప్రతి చిన్న విషయాన్నీ జాగ్రత్తగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి. ముఖ్యంగా ప్రజలతో, చరిత్రతో, ప్రముఖుల విగ్రహాలతో ముడిపడిన అంశాల్లో మరింత బాధ్యత అవసరం. ఒకసారి తప్పు జరిగితే దాన్ని సరిదిద్దుకోవడం మంచిదే. కానీ పదేపదే ఎవరో ఒకరు గుర్తు చేస్తేనే సరిదిద్దుకోవాల్సి వస్తే.. అది నాయకత్వంపై ప్రశ్నగా మారుతుంది.ఇప్పుడు బాపట్లలో చర్చ జరుగుతున్నది విగ్రహం మీద కాదు. ఎమ్మెల్యే నిర్ణయాలపై. నరేంద్ర వర్మకు సొంతంగా నిర్ణయం తీసుకునే రాజకీయ బలం లేదా? లేక సతీష్ ప్రభాకర్ అభ్యంతరం వ్యక్తం చేస్తే పరిస్థితి మారాల్సిందేనా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.అందుకే ఈ వ్యవహారంపై వినిపిస్తున్న వ్యంగ్య వ్యాఖ్య ఒక్కటే.."ముందు నిర్ణయం తీసుకోండి.. సతీష్ ప్రశ్నిస్తే సరిచేసుకోండి.. చివరికి 'సారీ సతీష్..!' అనాల్సిందేనా?"విగ్రహాల విషయంలో జరిగిన ఈ పరిణామం చిన్నదే కావచ్చు. కానీ ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజకీయ ప్రతిష్ఠకు మాత్రం ఇది చిన్న దెబ్బ కాదు. ఇకపై బాపట్లలో ఆయన తీసుకునే ప్రతి నిర్ణయాన్ని ప్రజలు నిశితంగా గమనించే పరిస్థితి ఏర్పడిందనే చెప్పాలి.

## బాలకోటిరెడ్డిపై వేటు

మొదటి పేజీ తరువాయి

**అమరావతి:రక్షణ న్యూస్:**

వేమూరు నియోజకవర్గం చుండూరుకు చెందిన బాపట్ల పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి గుదేటి బాలకోటిరెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం, క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడటం వంటి కారణాలతో ఈ చర్య తీసుకున్నట్లు తెలిసింది.ఇటీవల వంగవీటి రంగా జయంతి వేడుకల సందర్భంగా జనసేన నాయకులతో బాలకోటిరెడ్డికి వివాదం తలెత్తినట్లు పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదులు అందాయి. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారణకు ఆదేశించడంతో ప్రత్యేక కమిటీ విచారణ చేపట్టినట్లు సమాచారం. అనంతరం ఘటనపై వివరణ ఇవ్వాలని బాలకోటిరెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిసింది.

**వివాదాల పరంపర,,,**బాలకోటిరెడ్డి గతంలోనూ పలు వివాదాల్లో చిక్కుకున్నట్లు వేమూరు నియోజకవర్గంలో చర్చ ఉంది. వైసీపీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి దాడులకు పాల్పడ్డారనే ఆరోపణలు అప్పట్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ ఘటనలు రాజకీయంగా కూడా వివాదానికి దారితీశాయి.అంతేకాకుండా అప్పట్లో జిల్లా ఎస్పీగా పనిచేసిన ఉమా మహేశ్వరరావును లక్ష్యంగా చేసుకుని బాలకోటిరెడ్డి విడుదల చేసిన కొన్ని వీడియోలు కూడా వివాదాస్పదమయ్యాయి. పోలీసు అధికారిపై చేసిన వ్యాఖ్యలు, వీడియోల వ్యవహారంపై అప్పట్లో రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది.

**అధిష్ఠానం ఆగ్రహం...**తాజా జనసేన నేతలతో వివాదం, గతంలో చోటుచేసుకున్న ఘటనలు, పార్టీ నాయకులు--అధికారులతో విభేదాలకు సంబంధించిన ఫిర్యాదులను అధిష్ఠానం తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. పార్టీ క్రమశిక్షణను పదేపదే ఉల్లంఘిస్తున్నారన్న అభిప్రాయానికి వచ్చిన అనంతరం బాలకోటిరెడ్డిపై సస్పెన్షన్ చర్యకు నిర్ణయించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.పార్టీ లైన్ దాటే నేతలపై చర్యలు తప్పవని పల్లా శ్రీనివాసరావు గతంలోనే స్పష్టం చేశారు. తాజా చర్యతో వేమూరు టీడీపీలో బాలకోటిరెడ్డి వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

## వినికిడి లోపం ఉన్నవారికి డిగ్రీ కళాశాల

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు:రక్షణ న్యూస్:**

వినికిడి లోపం ఉన్న ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థుల ఉన్నత విద్యకు రాష్ట్రంలో తొలిసారిగా ప్రత్యేక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అందుబాటులోకి రానుంది. బాపట్ల జిల్లా వెదుల్లపల్లి వద్ద కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినట్లు విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఎస్.వెంకటరవనప్ప తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు.

**30 సీట్లతో ప్రారంభం**

2026--27 విద్యా సంవత్సరంలో కళాశాలలో 30 సీట్లతో బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సును అందించనున్నారు. దీనికి అనుబంధంగా ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సర్టిఫికేషన్ కోర్సును కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.రాష్ట్రంలో వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడమే ఈ కళాశాల ఏర్పాటులో ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఇప్పటివరకు డిగ్రీ విద్యలో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించి ప్రత్యేక విద్యా వాతావరణంలో విద్యార్థులు చదువుకునే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.

**23 నుంచి దరఖాస్తులు..**వినికిడి లోపం ఉన్న ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులు ఈ నెల 23వ తేదీ నుంచి దరఖాస్తులు సమర్పించవచ్చని వెంకటరవనప్ప తెలిపారు. ప్రవేశాలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9000013633, 9948372899 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. రాజ్యంలో ఈ తరహాలో తొలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కావడం ప్రత్యేకతగా అధికారులు పేర్కొన్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/21/2026 4:53 AM Page 3



# బృందావన్ గార్డెన్స్ రోడ్డుకు వేగం

## విస్తరణ చివరి దశ.. రెండు రోజుల్లో డ్రైన్ల పనులు పూర్తి చేయాలని ఆదేశం



**గుంటూరు:రక్షణ న్యూస్:** బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్డు విస్తరణ పనులు పూర్తికానున్న నేపథ్యంలో రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.విస్తరణ పనులు చివరి దశకు చేరుకున్నందున రోడ్డు నిర్మాణాన్ని ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని ఎస్ఈని ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను తరలించాల్సి ఉన్నందున సీపీడీసీఎల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. డ్రైన్ నిర్మాణం పెండింగ్‌లో ఉన్న ప్రాంతాల్లో రెండు రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఈఈని ఆదేశించారు.కల్వర్టు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించాలని, ఎమినిటి కార్యదర్శులు, ఏఈలు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. అనంతరం పట్టాభిపురం మెయిన్ రోడ్డులో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసిన భవనాన్ని కమిషనర్ పరిశీలించారు. బిల్డింగ్ మ్యాప్, సెట్‌బ్యాక్, సెల్లార్ తదితర అంశాలను తనిఖీ చేశారు.రోడ్లపై ఉన్న నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేధం అమలులో ఉన్నందున ఉల్లంఘనలు గుర్తిస్తే స్వచ్ఛ యాప్ ద్వారా జరిమానాలు విధించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పర్యటనలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో కలెక్టర్ తనిఖీ

## హాజరు, భోజనంపై ఆరా.. బాలుర హాస్టల్ వార్డెన్‌పై చర్యలకు ఆదేశం



**బాపట్ల:రక్షణ న్యూస్:** ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలు, విద్యార్థుల హాజరు, భోజన నాణ్యతపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వి. ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గురువారం బాపట్లలోని బాలికల, బాలుర గిరిజన సంక్షేమ వసతి గృహాలను పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.తొలుత తహసిల్దార్ కార్యాలయ రోడ్డులోని సమీకృత గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది, విద్యార్థుల హాజరు పుస్తకాలను పరిశీలించి విధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాలికల భద్రత కోసం హాస్టల్ ముందుభాగంలో ప్రహరీ గోడ నిర్మించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అనంతరం సంజయ్‌గాంధీ కాలనీలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, వంటశాల, భోజనశాలను తనిఖీ చేశారు. భోజనశాలలో తగినంత వెలుతురు, గాలి ఉండేలా విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.విద్యార్థుల సంఖ్య, హాజరులో వ్యత్యాసాలపై వార్డెన్‌ను ప్రశ్నించారు. హాస్టల్ వార్డెన్ పనితీరు సంతృప్తికరంగా లేదని, భోజనం సరిగా లేదన్న నివేదికపై ఆరా తీశారు. హాస్టల్ ఆవరణలో ఇతరుల వాహనాలు నిలుపుతున్న విషయంపై వార్డెన్‌పై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.శిథిలావస్థకు చేరిన పాత హాస్టల్ భవనాన్ని తొలగించేందుకు అనుమతుల కోసం ఫైల్ సమర్పించాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన ఆట వస్తువులు, ఇతర సామగ్రిని 'సేవా సేతు' ద్వారా దాతల సహకారంతో వారం రోజుల్లో సమకూర్చాలని గిరిజన సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఆవరణను పరిశుభ్రంగా ఉంచి మొక్కలు నాటి సంరక్షించాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు.తనిఖీలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అమర్ సుబ్బయ్య, తహసీల్దార్ సలీమా, మున్సిపల్ డీ ఈ కృష్ణారెడ్డి, వార్డెన్లు ప్రమోదిని, నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

# కొల్లూరులో 13 మందికి వైద్య సాయం

**వేమూరు రక్షణ న్యూస్**



కొల్లూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అనారోగ్య బాధితులు 13 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మొత్తం రూ.5,30,852 ఆర్థిక సహాయం మంజూరైంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితుల వైద్య ఖర్చులకు సంబంధించిన బిల్లులను వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సిఫార్సు లేఖలతో ముఖ్యమంత్రి సహాయనిధి కార్యాలయానికి పంపగా, అధికారులు పరిశీలించి అర్హులైన వారికి ఆర్థిక సహాయం మంజూరు చేశారు.గాజులంక గ్రామానికి చెందిన గాజుల మల్లేశ్వరికి రూ.1,22,979, కొల్లూరు గ్రామానికి చెందిన చందోలు నాగేశ్వరరావుకు రూ.60,195, సోమరౌతు వెంకట్రావుకు రూ.55,250, చినపులివర్రు గ్రామానికి చెందిన పాచిగళ్ల రత్నసురమణికి రూ.43,836, మిరియాల నాగలక్ష్మికి రూ.23,920, పాచిగళ్ల సుమన్‌కు రూ.28,155 చొప్పున మంజూరయ్యాయి .పెసర్లంక గ్రామానికి చెందిన చావలి అభిషేక్‌కు రూ.30,000, అన్నమనేని మణికంఠకు రూ.25,341, కిష్కిందపాలెం గ్రామానికి చెందిన కొల్లి వంశీకృష్ణకు రూ.21,346, దొక్కు లక్ష్మీకుమారికి రూ.40,503, తాడిగిరిపాడు గ్రామానికి చెందిన గుమ్మడి శ్యామలకు రూ.21,986, పోతర్లంక గ్రామానికి చెందిన బొల్లెద్దు ధనకుమారికి రూ.23,541, క్రాప గ్రామానికి చెందిన మట్టా శివకు రూ.33,800 చొప్పున ఆర్థిక సహాయం అందింది.మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు లబ్ధిదారులకు, వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు వైద్య చికిత్స సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటోందని తెలిపారు.పేదల సంక్షేమం, ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వేమూరు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని నక్కా ఆనందబాబు పేర్కొన్నారు.తమకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ప్రత్యేక చొరవ తీసుకుని సిఫార్సు చేసిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు లబ్ధిదారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ఎన్టీఆర్ స్టేడియంలో ఓపెన్ జిమ్

## వాకర్స్ కోసం సీఎస్ఆర్‌లో ఏర్పాటు.. ప్రారంభించిన కమిషనర్



**గుంటూరు:రక్షణ న్యూస్:** బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్స్ కోసం కరూర్ వైశ్యా బ్యాంక్ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ గురువారం ప్రారంభించారు. వాకర్స్‌కు ఉపయోగపడేలా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన అన్నారు.ప్రస్తుతం ప్రజలు ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెడుతున్నారని కమిషనర్ తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియానికి ప్రతిరోజూ వందల సంఖ్యలో వాకర్స్ వస్తుంటారని, వారికి ఓపెన్ జిమ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. స్టేడియాన్ని దశలవారీగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.స్టేడియంలో పారిశుధ్య నిర్వహణకు మరింత మంది కార్మికులు అవసరమని స్టేడియం కార్యదర్శి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన అవసరమైన కార్మికులను కేటాయించాలని సిటీ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు.కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, స్టేడియం కార్యదర్శి వజ్జా రామకృష్ణ, కరూర్ వైశ్యా బ్యాంక్ డీజీఎం ఎన్.రమేష్, చీఫ్ మేనేజర్లు అరవింద్ గణేష్, వెంకట సత్యనారాయణ, స్టేడియం కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు, కాంతారావు, వెంకట రత్తయ్య, యామిని శివజ్యోతి పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాపై సీఈవో సమీక్ష

## పోలింగ్ కేంద్రాలు, ఫారం--6, 7, 8పై కలెక్టర్లకు సూచనలు



**బాపట్ల:రక్షణ న్యూస్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, పోలింగ్ కేంద్రాలు, ఫారం--6, 7, 8, ఓటర్ల మ్యాపింగ్, హియరింగ్ షెడ్యూల్‌పై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అమరావతి 5వ బ్లాక్‌లోని సీఈవో కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం ఈ సమావేశం జరిగింది. బాపట్ల కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వి., ఇన్‌చార్జి డీఆర్ఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న, ఎలక్షన్ సెల్ పర్యవేక్షకులు షఫీ తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ మద్యానికి చెక్



**ముండ్లమూరు రక్షణ న్యూస్**

ముండ్లమూరు మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఎస్సై కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బహిరంగంగా మద్యం సేవించే ప్రదేశాల నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ప్రాంతాలను పోలీసులు గుర్తించి శుభ్రం చేశారు. అక్కడ లభించిన మద్యం సీసాలు, ఇతర వ్యర్థాలను తొలగించి దహనం చేశారు.ప్రజలకు ప్రశాంతమైన, సురక్షిత వాతావరణం కల్పించేందుకు బహిరంగంగా మద్యం సేవించడంపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/21/2026 4:53 AM Page 4



# డబ్బుల బెదిరింపులతో బలవన్మరణయత్నం

సత్తెనపల్లి రక్షణ న్యూస్



పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని నాగన్నకుంటకు చెందిన కుంచాల నాగమణి (40) మనస్తాపంతో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు వైద్యులు సిఫారసు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగమణి చర్చి నిర్మాణం నిమిత్తం పెదాల వెంకటేశ్వరమ్మకు సుమారు రూ.10 లక్షల నగదుతో పాటు బంగారం ఇచ్చినట్లు సమాచారం. ఈ ఘటన జరిగి దాదాపు రెండున్నర సంవత్సరాలు కావడంతో తన డబ్బు, బంగారం తిరిగి ఇవ్వాలని నాగమణి కోరినట్లు తెలిపారు. అయితే వెంకటేశ్వరమ్మ తన సోదరుడు నరసరావుపేటలో పెద్ద రౌడీషీటర్ అని, డబ్బులు అడిగితే అతనికి చెప్పి చంపిస్తానంటూ బెదిరించినట్లు నాగమణి పోలీసులకు తెలిపినట్లు సమాచారం. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

# ఆలయ నిర్మాణానికి మహేంద్రనాథ్ హామీ



చీరాల రక్షణ న్యూస్

కటారి వారిపాలెం గ్రామంలో జాలేరమ్మతల్లి, దుర్గమ్మతల్లి, పోలేరమ్మతల్లి అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మహేంద్రనాథ్ మాట్లాడుతూ, దేవాలయాలు గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. ఆలయాల నిర్మాణంతో గ్రామంలో భక్తి భావం మరింత పెంపొందడంతో పాటు సామాజిక ఐక్యత, గ్రామాభివృద్ధికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. అమ్మవారి ఆలయ నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని మహేంద్రనాథ్ హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక అవసరాలకు అనుగుణంగా ఆలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని ఆయన అన్నారు. భూమి పూజ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అగ్నిబాధితులకు అండగా మహేంద్రనాథ్ ఆపన్నహస్తం

చీరాల రక్షణ న్యూస్



దేవినూతల గ్రామంలో ప్రమాదవశాత్తు సంభవించిన అగ్నిప్రమాదంలో ఇళ్లు దగ్ధమై సర్వం కోల్పోయిన మూడు కుటుంబాలను చీరాల నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ పరామర్శించారు. కష్టకాలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలుస్తూ వారికి భరోసా కల్పించారు. అగ్నిప్రమాదంలో ఇళ్లు, ఇంటి సామగ్రి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు తక్షణ సహాయంగా ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున మొత్తం రూ.1.50 లక్షల ఆర్థిక సాయాన్ని మహేంద్రనాథ్ అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మహేంద్రనాథ్ మాట్లాడుతూ.. అగ్నిప్రమాదంతో సర్వం కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం తరపున పూర్తిస్థాయిలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాధితులకు ఇళ్ల నిర్మాణం, ఇతర అవసరాల కోసం ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయాన్ని త్వరితగతిన అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పదవులు, రాజకీయ బాధ్యతలు అనుభవించడంతో పాటు ఆపదలో ఉన్న పార్టీ శ్రేణులకు అండగా నిలవడం, వారి భుజం తట్టి ధైర్యం చెప్పడమే నిజమైన నాయకత్వానికి నిదర్శనమని మహేంద్రనాథ్ తన చర్యతో చాటిచెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు విడుదల చేయాలి



బాపట్ల రక్షణ న్యూస్

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు, ఎన్ఎంఆర్‌లు, గ్రీన్ అంబాసిడర్లకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, పంచాయతీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎన్. బాబూరావు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ గ్రామ పంచాయతీల్లో కార్మికులకు నెలకు రూ.4 వేల నుంచి రూ.12 వేల వరకు మాత్రమే వేతనాలు అందుతున్నాయని తెలిపారు. ఆ స్వల్ప వేతనాలు కూడా నెలల తరబడి చెల్లించకపోవడంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కొల్లూరు, చీరాల, వేటపాలెం తదితర మండలాల్లో పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను ఒకే విడతలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చట్టబద్ధంగా లభించాల్సిన వారాంతపు, ఇతర సెలవులను అమలు చేయాలని కోరారు. సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న దుస్తులు, చెప్పులు, సబ్బులు, రక్షణ పరికరాలను వెంటనే అందించాలని విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 'సమాన పనికి సమాన వేతనం' అమలు చేసి మున్సిపల్ కార్మికులతో సమానంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే 2015, 2023 హైకోర్టు ఉత్తర్వుల మేరకు టెండర్ల పేరుతో కార్మికులను వేధించడం నిలిపివేయాలని బాబూరావు స్పష్టం చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం, అధికారులు తక్షణమే పరిష్కరించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చొప్పర శ్రీనివాసరావు, కొమ్మినేని శ్రీనివాసరావు, నాయకులు చెం చయ్య, వదనం, గట్టుపల్లి రాంప్రసాద్, కె. జక్రయ్య, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి. కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు కూటమి ప్రభుత్వం భరోసా



దాచేపల్లి రక్షణ న్యూస్

బీసీల హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ ప్రాతినిధ్యాన్ని పరిరక్షించడమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ బీసీ నేతలు పేర్కొన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను స్వాగతిస్తూ దాచేపల్లి పట్టణంలోని నారాయణపురం టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. టీడీపీ ఆవిర్భావం నుంచే బీసీల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎన్టీఆర్ ప్రారంభించిన బీసీ సంక్షేమం, సాధికారత కార్యక్రమాలను చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్నారని తెలిపారు. బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కీలక ముందడుగని పేర్కొన్నారు. 34 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బీసీల రాజకీయ సాధికారతకు దోహదపడుతుందని నేతలు అన్నారు. బీసీలకు ఇచ్చిన హామీలను టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తోందని, బీసీల సంక్షేమం విషయంలో మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపిస్తోందని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిందని విమర్శించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీలకు అండగా నిలుస్తోందని, రానున్న రోజుల్లో బీసీల ఆర్థిక, రాజకీయ సాధికారత కోసం మరిన్ని చర్యలు చేపడుతుందని నేతలు ధీమా వ్యక్తం చేశారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై హర్షం వ్యక్తం చేస్తూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో దాచేపల్లి టౌన్ పార్టీ అధ్యక్షుడు షేక్ అహ్మద్ షరీఫ్, గురజాల నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బొమ్మనబోయిన నాగరాజు యాదవ్, ఏఎంసీ చైర్మన్ బెల్లంకొండ భారతి బద్రి, దాచేపల్లి సొసైటీ బ్యాంక్ చైర్మన్ తంగళ్ల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కూటమి నేతలు, బీసీ, ఎస్సీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/21/2026 4:53 AM Page 5



# బీసీల అభ్యున్నతికి కోటమి ప్రభుత్వం కృషి

**ముండ్లమూరు రక్షణ న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు ఒకే రోజు రెండు పండుగలు వచ్చినట్లుగా ఉందని టీడీపీ రజక సాధికార దర్శి నియోజకవర్గ కన్వీనర్ పూరిమెట్ల యల్లయ్య అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ వడ్డెర సామాజిక వర్గానికి చెందిన మహిళ రమాదేవికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుందని యల్లయ్య పేర్కొన్నారు. 34 శాతం రిజర్వేషన్ల నిర్ణయం బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం బీసీల భవిష్యత్ తరాలకు ప్రయోజనం చేకూర్చే చారిత్రాత్మక నిర్ణయంగా నిలుస్తుందని అన్నారు. బీసీ వడ్డెర సామాజిక వర్గానికి చెందిన రమాదేవికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం ద్వారా బీసీ మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం మరింత పెరిగిందని తెలిపారు. వెనుకబడిన వర్గాలకు రాజకీయ




ప్రాతినిధ్యంతో పాటు విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించాలని ప్రభు త్వాన్ని కోరారు. రమాదేవికి ఎమ్మె ల్సీ అవకాశం కల్పించిన ందుకు ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమ ంత్రి పవన్ కళ్యాణ్, భారతీయ జనతా పార్టీకి బీసీ వర్గాల తరపున యల్లయ్య కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించారని యల్లయ్య విమర్శించారు. బీసీలకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్లను 25 శాతానికి తగ్గించారని ఆరోపించారు. దీంతో బీసీ వర్గాలు గత ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాయని అన్నారు. ఇప్పటికైనా వైసీపీ వెనుకబడిన వర్గాల మనోభావాలకు అనుగుణంగా వ్యవహరించకపోతే భవిష్యత్తులోనూ బీసీల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# వసతి గృహాల పై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

## వసతి గృహాల్లో లోపాలపై కలెక్టర్ సీరియస్...

**బాపట్ల రక్షణ న్యూస్**

గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో పరిస్థితులు, విద్యార్థుల హాజరు, భోజన నాణ్యత, వసతులపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఆకస్మిక తనిఖీల్లో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. విద్యార్థుల సంఖ్యకు, హాజరుకు మధ్య వ్యత్యాసం ఉండటంపై బాలుర వసతి గృహం వార్డెన్‌ను కలెక్టర్ వివరణ కోరడం, భోజనం సక్రమంగా అందడం లేదన్న ఫిర్యాదులపై ఆరా తీయడం ప్రాధాన్యత సంతరించుకుంది. సంజయ్ గాంధీ కాలనీలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్.. విద్యార్థులు, సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. రికార్డుల్లో నమోదైన విద్యార్థుల సంఖ్యకు హాజరైన వారి సంఖ్యకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించి వార్డెన్‌ను ప్రశ్నించారు. వార్డెన్ పనితీరు సంతృప్తికరంగా లేదన్న నివేదికతో పాటు విద్యార్థులకు భోజనం సక్రమంగా అందడం లేదన్న అంశంపైనా వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహ ఆవరణలో ఇతరుల వాహనాలు నిలిపి ఉంచడంపై కూడా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల వసతి కోసం ఉద్దేశించిన ప్రాంగణంలో ఇతరుల వాహనాలకు చోటు ఎలా కల్పించారని వార్డెన్‌ను ప్రశ్నించి, ఈ వ్యవహారంపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన పాత భవనం నిరుపయోగంగా ఉండటాన్ని గుర్తించిన ఆయన దానిని తొలగించేందుకు అనుమతుల కోసం వెంటనే ఫైల్ సమర్పించాలని సూచించారు. భోజనశాలలో తగినంత వెలుతురు,



గాలి లేకపోవడాన్ని గుర్తించిన కలెక్టర్ అదనపు విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వసతి గృహంలోని వంటశాల, భోజనశాల, మరుగుదొడ్లు, మూత్రశాలలను స్వయంగా పరిశీలించి పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. బాలికల వసతి గృహం తనిఖీలో భద్రత అంశంపై కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. తహసీల్దార్ కార్యాలయ రోడ్డులోని సమీకృత గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహం ముందుభాగంలో ప్రహరీ గోడ లేకపోవడాన్ని గుర్తించి, బాలికల భద్రత కోసం ప్రహరీ గోడ నిర్మించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన ఆట వస్తువులు, ఇతర సామగ్రిని దాతల సహకారంతో వారం రోజుల్లో సమకూర్చాలని అధికారులకు ఆదేశించారు. వసతి గృహ ఆవరణలను పరిశుభ్రంగా ఉంచడం, మొక్కలు నాటి సంరక్షించడం, అవసరమైన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వసతి గృహాల్లో విద్యార్థుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యానికి తావులేదని కలెక్టర్ స్పష్టం చేశారు. భోజనం, హాజరు, పరిశుభ్రత, భద్రత, వసతులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

## జర్నలిజం కోర్సుకు గడువు పెంపు

**బాపట్ల రక్షణ న్యూస్**

సి.ఆర్. మీడియా అకాడమీ, నాగార్జున యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న 'జర్నలిజంలో డిప్లమో కోర్సు'కు దరఖాస్తు గడువును సెప్టెంబర్ 5వ తేదీ వరకు పొడిగించినట్లు మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సుపై వివిధ వర్గాల నుంచి వస్తున్న విచారణలు, డిమాండ్‌తో పాటు జర్నలిస్టు సంఘాలు, పాత్రికేయుల విజ్ఞప్తి మేరకు



దరఖాస్తు గడువును పొడిగించినట్లు పేర్కొన్నారు. కోర్సుకు దరఖాస్తు చేసుకునే జర్నలిస్టులు రూ.2 వేల ఫీజు, ఇతర అభ్యర్థులు రూ.2,500 ఫీజు చెల్లించాలి. ఫీజును 'సెక్రెటరీ, సి.ఆర్. మీడియా అకాడమీ' పేరుతో ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. జర్నలిస్టులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి కలిగిన ఇతర అభ్యర్థులకు డిగ్రీ ఉత్తీర్ణతను అర్హతగా నిర్ణయించినట్లు అకాడమీ కార్యదర్శి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**పల్నాడు రక్షణ న్యూస్**



కర్నూలు జిల్లా ఆదోని మండలం నెట్టేకల్ గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మార్కాపురం జిల్లాకు చెందిన గంగాధర్ సింగ్ (25) మృతి చెందారు. పెద్దమ్మ ఇంటికి ద్విచక్రవాహనంపై బయలుదేరిన గంగాధర్ సింగ్ మార్గమధ్యలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలిం చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## అసెంబ్లీ భద్రతపై ఐజీ, ఎస్పీ ప్రత్యేక నిఘా



**తుళ్లూరు రక్షణ న్యూస్**

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఇంటెలిజెన్స్ ఐజీ పకీరప్పతో కలిసి నాలుగో రోజు తుళ్లూరులో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అసెంబ్లీ పరిసర ప్రాంతాలు, ప్రధాన రహదారులు, చెక్‌పోస్టులు, పార్కింగ్ ప్రాంతాలు, ప్రవేశ ద్వారాల వద్ద చేపట్టిన భద్రతా చర్యలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అసెంబ్లీకి వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతరులు ప్రయాణించే ప్రధాన మార్గాల్లో కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలను మరింత పటిష్టం చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పార్కింగ్ ప్రాంతాల్లోనూ నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రవేశ ద్వారాల వద్ద భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అనుమతులు ఉన్న వ్యక్తులను మాత్రమే నిబంధనల ప్రకారం లోపలికి అనుమతించాలని ఎస్పీ సూచించారు. అసెంబ్లీ సమావేశాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి స్థాయిలో భద్రతా చర్యలను సమన్వయంతో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రతా పర్యవేక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. డ్రోన్ల ద్వారా కీలక ప్రాంతాల్లో నిరంతర నిఘా కొనసాగించాలని, సీసీ కెమెరాల ద్వారా ప్రధాన మార్గాలు, ప్రవేశ ద్వారాలు, పార్కింగ్ ప్రాంతాల్లో కదలికలను పర్యవేక్షించాలని తెలిపారు. కమ్యూనికేషన్ వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగిస్తూ క్షేత్రస్థాయి సిబ్బంది, ఉన్నతాధికారుల మధ్య సమాచార మార్పిడి వేగంగా జరిగేలా చూడాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద పరిస్థితులు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యే వరకు భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన మేరకు చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. ఐజీ పకీరప్పతో కలిసి కీలక ప్రాంతాలను పరిశీలించిన ఆయన, విధుల్లో ఉన్న సిబ్బందికి భద్రతా పరంగా పలు సూచనలు చేశారు.